క్లుప్తంగా

బాలబాలాజీని దర్శించుకున్న ఎమ్మెల్యే దంపతులు



అప్పనపల్లిలో బాలబాలాజీని దర్శించుకున్న ఎమ్మెల్యే చిట్టిబాబు దంపతులు

మామిడికుదురు: అప్పనపల్లిలో బాలబాలాజీ స్వామిని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ఆదివారం దర్శించుకున్నారు. స్వామికి చిట్టిబాబు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు చిట్టిబాబు దంపతులకు ఆశీర్వాదాలు ఇచ్చారు. తొలుత ఆలయ చైర్మన్ చిట్టూరి రామకృష్ణ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చిట్టిబాబుకు ఘన స్వాగతం పలికారు. మండల పార్టీ అధ్యక్షుడు కొమ్ముల రాము, నాయకులు పిచ్చుక చిన్న, గెడ్డం వెంకటేశ్వరరావు, నెల్లి దుర్గాప్రసాద్, చిక్కం బుచ్చిబాబు, ఆలయ అధికారులు, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

సీతారామ స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే రాజా



ఆదుర్రులో సీతారామస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మామిడికుదురు: ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఆదుర్రులోని సీతారామస్వామిని రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఆదివారం దర్శించుకుని పూజలు చేశారు. అర్చకస్వామి పూజ్యం శ్రీను శర్మ రాజాకు ఆశీర్వచనాలు అందించి సత్కరించారు. ఆయన వెంట స్టేట్ ఫుడ్ కమిటీ మెంబర్ జక్కంపూడి కిరణ్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు జక్కంపూడి తాతాజీ, పార్టీ నాయకులు తోరం సూర్యభాస్కర్, జక్కంపూడి వాసు, గౌతమ్, ఏసు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులను ఆదుకుంటాం



నరేంద్రపురంలో అగ్నిప్రమాద బాధితులకు సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

పి.గన్నవరం: నరేంద్రపురంలో అగ్నిప్రమాద బాధిత కుటుంబాలను ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. ఇటీవల నరేంద్రపురంలో జరిగిన అగ్నిప్రమాదంలో తాటాకిల్లు దగ్ధమై నేలపూడి సత్యనారాయణ, వెంకటేశ్వరరావుల కుటుంబాలు నిరాశ్రయులైన విషయం విదితమే. బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే చిట్టిబాబు ఆదివారం పరామర్శించారు. వారికి బియ్యం, నిత్యావసరాలను చిట్టిబాబు అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మెల్లం మహాలక్ష్మి ప్రసాద్, పార్టీ రాష్ట్ర నాయకుడు అడ్డగళ్ల వెంకటసాయిరామ్, నాయకులు రాయుడు చిన్న, జల్లి పండు, గుత్తుల త్రిమూర్తులు, మానుకొండ నాగేంద్ర, నూకపెయ్యి రాజేంద్ర ప్రసాద్, మండల జేసీఎస్ కన్వీనర్ దొమ్మేటి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవార్లకు సారె సమర్పణ



మాచవరంలో అమ్మవార్లకు సారెతో వస్తున్న గురుభవానీలు, భవానీలు, మహిళలు

అంబాజీపేట: మాచవరంలో వేంచేసిన ఇటికాలమ్మ, మహాలక్ష్మి అమ్మవార్లకు గురు భవానీలు దంగేటి సాయిబాబు-మల్లేశ్వరి దంపతులు, గురుభవాని మట్టపర్తి దుర్గారావు (ఏసు), గురుభవాని మట్టపర్తి దుర్గాప్రసాద్‌ల ఆధ్వర్యంలో ఆదివారం సారె సమర్పించారు. పోతాయిలంక భక్తాంజనేయ స్వామి ఆలయం వద్ద నుంచి భవానీలు, గ్రామ ఆడపడుచులు కలసి అమ్మవార్లకు చలివిడి పానకాలు, పసుపు కుంకుమలు, చీరలు, స్వీట్లు, బూరెలు, గారెలతో మేళతాళాలు, జైదుర్గా, జైజై దుర్గా శరణుగోష నడుమ భారీ ర్యాలీగా తరలి వెళ్లారు. అనంతరం అమ్మవారికి సారె సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో గురు భవనీలు, భవానీలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థి ప్రతిభ

అయినవిల్లి: రామచంద్రపురంలో జిల్లా స్థాయిలో జరిగిన సైన్స్ వైజ్ఞానిక ప్రదర్శనలో నేదునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి తిప్పా గౌతమ్ ద్వితీయ బహుమతిని కైవసం చేసుకున్నాను. గౌతమ్‌ను పలువురు అభినందించారు. టీచర్ ఎగ్జిబిట్‌లో విలస ప్రధానోపాధ్యాయుడు ప్రదర్శన తృతీయ స్థానంలో నిలిచింది. వీరు ఈ నెల 28, 29లో కడపలో జరిగే రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపికయ్యారు.

క్రిస్మస్ వేడుకలకు సర్వం సిద్ధం

- కనువిందు చేస్తున్న వేదికలు
- గ్రామాల్లో నెలకొన్న సందడి



అయినవిల్లిలంక ఆర్సీఎం చర్చిలో క్రిస్మస్ వేడుకలు



మడికిలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న క్రైస్తవులు



విద్యుత్ దీపాలంకరణలో పలివెల పేరిస్ చర్చి

ఆలమూరు: పాపుల రక్షణ కొరకు దివి నుంచి భువికి వచ్చిన ప్రభువైన క్రీస్తు జన్మదిన వేడుకలకు సర్వం సిద్ధమైంది. ఇప్పటికే వివిధ గ్రామాల్లోని క్రైస్తవ చర్చిలు విద్యుతీలంకరణతో కళకళలాడుతున్నాయి. క్రైస్తవ ఆలయాల వద్ద, భక్తుల నివాసం లోనూ క్రీస్తు ప్రతిరూపమైన ధ్రువతారలు ప్రకాశిస్తున్నాయి. క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు మత ప్రబోధకులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకుని పలు చోట్ల క్రీస్తు భక్తి గీతాలతో కూడిన విభావరి భక్తులను విశేషంగా ఆకట్టుకుంటుంది. ప్రార్థనాలయాల్లో ఏర్పాటు చేసిన క్రిస్మస్ ట్రీలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. స్థానిక బిలీవర్ చర్చిలో పాస్టర్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి ఐక్య క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి.

మలికిపురంలో..

మలికిపురం: క్రీస్తు పుట్టినరోజు వేడుకలకు ప్రార్థనా మందిరాలు, నివాస గృహాలు సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. క్రిస్మస్ నేపథ్యంతో రాజోలు దీవిలోని గ్రామీణ ప్రాంతాల్లో సందడి నెలకొంది. రాజోలు నియోజకవర్గంలోని మలికిపురం, రాజోలు, సఖినేటిపల్లి మండలాల్లోని దాదాపు అన్ని గ్రామాల్లో ఎక్కడ చూసినా చర్చిలు, ఇళ్ల వద్ద ఏర్పాటు చేసిన క్రిస్మస్ స్టార్‌లు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. పలు చర్చిలను సుందరంగా అలంకరించడంతో గ్రామాలు క్రిస్మస్ శోభను సంతరించుకున్నాయి. ఈ నెల 25 శుక్రవారం క్రిస్మస్ పండగను ఘనంగా నిర్వహించేందుకు చర్చిల వద్ద నిర్వాహకుల ఆధ్వర్యంలో భారీగా ఏర్పాట్లు జరిగాయి.

అంబాజీపేటలో..

అంబాజీపేట: క్రిస్మస్ వేడుకలను సోమవారం నిర్వహించుకునేందుకు మండలంలోని క్రైస్తవ ప్రార్థనా మందిరాలు ముస్తాబయ్యాయి. చర్చిలను విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరిస్తున్నారు. అంబాజీపేట, ఇరుసుమండ, పుల్లేటికుర్రు, గంగలకుర్రు, మొసలపల్లి, ఇసుకపూడి, చిరతపూడి తదితర గ్రామాల్లో ఉన్న చర్చిలు నూతన హంగులు దిద్దుకున్నాయి. మండలంలోని చర్చిల వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు పలువురిని ఆకట్టుకుంటున్నాయి. కముజువారిపేటలోని చెరువులో నిర్మించిన క్రీస్తురాజు, కారుణ్యక్రీస్తు మందిరాలు ఆకట్టుకుంటున్నాయి.

అయినవిల్లిలో..

అయినవిల్లి: మండలంలోని అయినవిల్లిలంక ఆర్సీఎం చర్చిలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. క్రిస్మస్ ట్రీ, పశువులపాక ఏర్పాటు చేసి వేడుకలు జరిపారు. ఈ సందర్భంగా చిన్నారులు నృత్యప్రదర్శనలు చేశారు. పాటలు ఆలపించారు. పాస్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అలాగే మండలంలోని పలు గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరిపారు.

పలివెలలో..

కొత్తపేట: మండలంలోని పలివెల పేరిస్ చర్చి వద్ద ఆదివారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఫాదర్ కె.ఆంథోని ఆధ్వర్యంలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో క్రీస్తు జన్మ విలువలను వివరించారు. ఈ సందర్భంగా చర్చి ఆవరణలో అలంకరించిన విద్యుత్ దీపాలంకరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

పంట బోదెలో పూడికతీత

ఆలమూరు: రబీ సీజన్‌లో నీటి ఎద్దడి లేకుండా సకాలంలో సాగునీరు పారేందుకు గ్రామంలోని రైతులు చర్యలు చేపట్టారు. చింతలూరు ఎస్సీ కాలనీ నుంచి పినపళ్ల ధనలక్ష్మి ఆలయం వరకూ ఉన్న పంట కాలువ వ్యర్థాలతో నిండిపోయింది. కూలీల సాయంతో గ్రామాభివృద్ధి కమిటీ సహకారంతో రైతులు పూడిక తీయించుకున్నారు. దీని వల్ల గ్రామంలో వందలాది ఎకరాల పంటకు సరైన సమయానికి సాగునీరు అందే వీలు కలుగుతుందని వైఎస్సార్ సీపీ నేతలు ఉండమట్ల శ్రీనివాసు, కోట బూరయ్య అన్నారు. ఇప్పటికే గ్రామాభివృద్ధి నిధులతో చింతలూరు నుంచి సంధిపూడి వరకూ ఉన్న వెదురుమూడి కాలువను శుభ్రం చేసుకున్నారు.

పంచముఖ ఆంజనేయస్వామి వాహనంపై గ్రామోత్సవం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని దేవస్థానంలో శనివారం రాత్రి స్వామిని పంచముఖ ఆంజనేయస్వామి వాహనంపై అర్చకులు గ్రామోత్సవం నిర్వహించారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉదయం కంచుగరుడ వాహనంపై గ్రామోత్సవం నిర్వహించిన అర్చకులు రాత్రి పంచముఖ ఆంజనేయ స్వామి వాహనంపై గ్రామోత్సవం చేశారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు

మామిడికుదురు: మండలంలోని పెదపట్నంలో వేంచేసిన ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం శ్రీహనుమాన్ వ్రతం 61వ ఏకాహాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామికి తమలపాకులు, గంధ సిందూరం, చామంతి పూలతో సహస్ర నామ పూజలు, వ్రతాలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.

ఘనంగా విజయదుర్గమ్మ తీర్థం

ఆలమూరు: మండలంలోని బడుగువానిలంకలో వేంచేసిన విజయదుర్గమ్మ అమ్మవారి తీర్థం ఆదివారం వైభవంగా జరిగింది. లంక గ్రామాల రైతుల ఇలవేల్పుగా భావించే అమ్మవారికి గ్రామంలో నిర్వహించే జాతర, తీర్థ మహోత్సవాలకు ప్రత్యేక చరిత్ర ఉంది. అమ్మవారి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన తీరు భక్తులను అలరించింది. కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారిని దర్శించుకునేందుకు సమీప గ్రామస్తులే కాకుండా ఆత్రేయపురం, ఆలమూరు, కడియం, రావులపాలెం, కపిలేశ్వరపురం తదితర మండలాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ చర్యలు చేపట్టింది. చంటి పిల్లలకు తమ తల్లిదండ్రులు పటికబెల్లాన్ని తులాభారంగా అందించారు. అమ్మవారి తీర్థం పురస్కరించుకుని శనివారం రాత్రి వైభవంగా జాతర జరిగింది. ఆలయానికి చేపట్టిన విద్యుద్దీపాలంకరణ, చలువ పందిళ్లు, సంగీత విభావరి భక్తులను ఆకట్టుకుంది.

ప్రకృతి వ్యవసాయానిదే భవిష్యత్



కత్తిమండలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

మలికిపురం: భవిష్యత్‌లో ఆహార ఉత్పత్తిలో ప్రకృతి వ్యవసాయానిదే కీలక పాత్ర అని రాజోలు ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు తనయుడు వెంకట్రామ్ అన్నారు. సెర్ప్ సీఈవో ఆదేశాలతో ఏపీసీఎన్ఎఫ్ రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో విజయవంతంగా అమలు చేస్తున్న నేచురల్ ఫార్మింగ్ ప్రకృతి వ్యవసాయ విధానంపై మండల సమాఖ్య ఓబీ సభ్యులకు మండలంలోని కత్తిమండలో ఆదివారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న వెంకట్రామ్ మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయంపై ప్రతి ఒక్కరూ అవగాహన కల్పించుకుని సాగు చేయాలని సూచించారు. మండల సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు జి.సుమలత మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించి రసాయన రహిత వ్యవసాయం చేయాలని సూచించారు. మండల ఏపీఎం డి.వరాలబాబు, శిరీష, సీసీ బి.నాగరాజు, ఎంటీ జోసెఫ్, సీహెచ్ చిట్టిస్వరాజ్, నాగబాబు, రవికాంత్, సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

శివారు ప్రాంతాలకు రక్షిత నీరు పంపిణీ



కూనవరంలో తాగునీటి ట్యాంక్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాపాక

రాజోలు: నియోజకవర్గంలోని అన్ని శివారు ప్రాంతాలకు రక్షిత తాగునీరు అందించేందుకు పైప్‌లైన్ విస్తరణ, కొత్త తాగునీటి ట్యాంకుల నిర్మాణ పనులు వేగవంతంగా చేపడుతున్నామని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. ఆదివారం కూనవరం, తాటిపాక గ్రామాల్లో పైప్‌లైన్ విస్తరణ పనులకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఆయన మట్లాడుతూ రానున్న వేసవిలో రక్షిత తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముఖ్యంగా తీరప్రాంతాలు, శివారు ప్రాంతాలు లక్ష్యంగా పైప్‌లైన్ విస్తరణ పనులపై దృష్టి సారించామన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సంక్షేమం, అభివృద్ధి విరాజిల్లుతుందన్నారు. రాబోయే ఎన్నికల్లో మళ్లీ సీఎంగా జగన్‌మోహన్ రెడ్డిని విజయపథంలో నిలపాలని కోరారు. సర్పంచ్‌లు బోనం అచ్చియ్యనాథం, కోటిపల్లి రత్నమాల, ఏఎంసీ చైర్‌పర్సన్ గుబ్బల రోజారమణి, జెడ్పీటీసీ మట్టా శైలజ, సూర్యబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్తేరు రాణి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి మట్టా ఏడుకొండలు, నాయకులు గుబ్బల మనోహర్, రొక్కం వెంకట్, చెల్లింగి చినబాబు, అడబాల జానకీరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఆనందమానందమాయె..



ముక్తేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1977-78 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

అయినవిల్లి: మండలం ముక్తేశ్వరం జయంతి రామయ్యపంతులు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1977–78 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఒకచోటకు చేరి సంబరాలు చేసుకున్నారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని అలనాటి తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులను సత్కరించారు. వారి ఆశీస్సులు తీసుకున్నారు. తమ ఉన్నతికి మీరే కారణం అంటూ మీరు ఇచ్చిన దీవెనలేనంటూ వారిని కీర్తించారు. వచ్చిన పూర్వ విద్యార్థులందరికీ బహుమతులు అందజేశారు. ఉదయం ప్రారంభమైన ఈ సంబరం సాయంత్రం ఆరు గంటల వరకూ సాగింది. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. జిహ్వకూ పసందైన విందునూ ఆరగించి ఒకరినొకరూ ఆనంద భాష్పాలతో వీడ్కోలు చెప్పుకొన్నారు.

వినియోగదారుల చట్టంపై అవగాహన పెంపొందించుకోవాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న న్యాయవాదులు, ఉపాధ్యాయులు

రావులపాలెం: ప్రతి ఒక్కరూ వినియోగదారుల చట్టంపై అవగాహన పెంపొందించుకోవాలని పలువురు వక్తలు సూచించారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వినియోగదారుల దినోత్సవం పురస్కరించుకొని వినియోగదారుల రక్షణ చట్టంపై కామర్స్ అధ్యాపకుడు బీపీఎస్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ అధికారి ఎస్.అరుణ్ కుమార్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ చప్పిడి కృష్ణ అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా ఆంధ్రప్రదేశ్ హైకోర్టు సీనియర్ న్యాయవాది, టి.నాగేషు, కొత్తపేట బార్ కౌన్సిల్ సీనియర్ న్యాయవాది ఎ.భాస్కర్ విచ్చేసి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రపంచంలో జీవిస్తున్న ప్రతి వ్యక్తి కూడా వినియోగదారుడే అన్నారు. వినియోగదారులకు 'వినియోగదారుల రక్షణ చట్టం' రక్షణ కవచంలా పనిచేస్తుందన్నారు. ఈ చట్టంపై ప్రజల్లో అవగాహన చాలా అవసరమని, ప్రస్తుత సమాజంలో వివిధ రకాల అడ్వర్టైజ్మెంట్లు, ఆఫర్లు, ఒకటి కొంటే ఒకటి ఫ్రీ, క్యాష్ బ్యాక్, డిస్కౌంట్లు మొదలగునవి వినియోగదారులను ప్రభావితం చేస్తున్నాయని, తూనికలు, కొలతలు, కల్తీ పదార్థాలు, మొదలగు వాటి మీద వినియోగదారులు అవగాహన కలిగి ఉండాలన్నారు. వస్తు వినియోగంలో వినియోగదారునికి ఏ విధమైన నష్టం వాటిల్లినా, జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయి, జాతీయస్థాయిలో కూడా చట్టాలు పనిచేస్తున్నాయన్నారు. వాటికి ఫిర్యాదు చేసి చట్టప్రకారం నష్టపరిహారం పొందవచ్చని, వస్తువు కొనేముందు ఆ వస్తువు యొక్క తయారీ తేదీ, చివరి తేదీ, నాణ్యత, వంటివి సరిచూసుకొని కొనుగోలు చేయాలని సూచించారు. తద్వారా ఏ విధమైన సమస్యలు వినియోగదారునికి రావని, ఏ సమస్య వచ్చినా వినియోగదారుల చట్టం ముందు ఫిర్యాదు చేయాలన్నారు. దీంతో చట్ట ప్రకారం న్యాయం జరుగుతుందన్నారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు శ్రీనివాస్, దుర్గాదేవి, ప్రసాద్, యువరాజ్, హరిబాబు, సిద్ధార్థ, రాజేంద్ర, పూజ, హేమలత, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధిగా 'నేదునూరి'



నేదునూరి రాజేష్

మామిడికుదురు: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందా కృష్ణమాదిగ ఆదేశాలతో కొత్తపేట మండలం ఖండ్రిగలో ఆదివారం జరిగిన సమావేశంలో మామిడికుదురు మండలం పెదపట్నం గ్రామానికి చెందిన నేదునూరి రాజేష్‌ను జిల్లా ఎమ్మార్పీఎస్ అధికార ప్రతినిధిగా ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్‌లో కీలకంగా వ్యవహరిస్తున్న రాజేష్ జిల్లా అధికార ప్రతినిధిగా ఎన్నిక కావడంపై జిల్లాలోని ఎమ్మార్పీఎస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి.

రామ జన్మభూమి అక్షతల ఊరేగింపు

మామిడికుదురు: మండలంలోని పెదపట్నంలో ఆదివారం అయోధ్య శ్రీరాముని పూజిత అక్షతల ఊరేగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పురవీధుల గుండా స్వామి వారి శోభాయాత్ర జరిగింది. జైశ్రీరామ్ నామస్మరణలతో గ్రామం మార్మోగింది. కార్యక్రమంలో విశ్వ హిందూ జిల్లా సంపర్క్ భమిడిపాటి మూర్తి, గాది వెంకట్రావు (బాబులు), వాసంశెట్టి మారియ్య, కడలి గోపి, కొమ్ముల బుజ్జి, పుచ్చల శేఖర్, కట్టా సత్తిబాబు, కొమ్ముల నాగబాబు, కోడేటి వెంకట్రావు, బుజ్జి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ

మామిడికుదురు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని రూ.25 లక్షలకు పెంచి పేద ప్రజల ఆరోగ్యానికి మరింత భరోసా కల్పించారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.25 లక్షల వరకూ ఉచితంగా వైద్యం పొందే స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డులను మండలంలోని అప్పనపల్లి గ్రామ సచివాలయం వద్ద లబ్దిదారులకు ఆదివారం ఆయన అందజేశారు. మండల పరిషత్ కార్యాలయ ఏఓ కె.వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ ఈ కార్డుల పంపిణీని నియోజవర్గంలో అప్పనపల్లి నుంచి ప్రారంభిస్తున్నట్టు వివరించారు. మండల పార్టీ అధ్యక్షుడు కొమ్ముల రాము, బాలబాలాజీ దేవస్థానం కమిటీ చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, నాయకులు పిచ్చుక చిన్న, గెడ్డం వెంకటేశ్వరరావు, నెల్లి దుర్గాప్రసాద్, చిక్కం బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

అంబాజీపేట: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తి వద్ద నుంచి 13 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఎ.చైతన్యకుమార్ ఆదివారం తెలిపారు. మాచవరంలో మామిడిశెట్టి జయకృష్ణ వద్ద రూ.1,800 విలువ చేసే 13 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

300 మందికి దుప్పట్ల పంపిణీ

కొత్తపేట: ముక్కోటి ఏకాదశి, ఆంజనేయ స్వామి వారి వార్షికోత్సవం పురస్కరించుకుని మండలంలోని రాకుర్తి వారిపాలెం గ్రామంలో అదే గ్రామానికి చెందిన కురస నాగభూషణం(చిన్న) దంపతులు ఆదివారం ఉదయం హనుమాన్ వ్రతం నిర్వహించుకున్నారు. భారీ సంఖ్యలో భక్తులను ఆహ్వానించి భారీ అన్న సమారాధన నిర్వహించారు. తొలుత సేవే మార్గం ప్రేమే లక్ష్యంగా తోటి వారికి తన వంతు సహాయ సహకారాలు అందించాలని సంకల్పంతో 300 మంది పేదలకు దుప్పట్లను అందజేశారు. అలాగే గతంలో కూడా కరోనా సమయంలో తన వంతు తోటి వారికి సహాయ పడాలని ఉద్దేశంతో నిత్యావసరాలను పలు రకాల కూరగాయలను ఇంటింటికీ తిరిగి పంపిణీ చేశారు. ఈ సేవా కార్యక్రమాలను చేస్తున్న చిన్న దంపతులను పలువురు అభినందించి ఇలాంటి కార్యక్రమం ఎన్నో నిర్వహించే శక్తిని ఆ ఆంజనేయస్వామి మీకు కలుగజేయాలని ఆకాంక్షించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు మేడిచర్లపాలెం పాఠశాల



రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరచిన విద్యార్థులు, ఉపాధ్యాయిని అరుణకుమారి

మలికిపురం: రాష్ట్ర స్థాయి గణిత విభాగం పోటీలకు మండలంలోని మేడిచర్లపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల ఎంపికయినట్లు ప్రధానోపాధ్యాయుడు కేజే సాయిబాబు ఆదివారం తెలిపారు. పాఠశాలకు చెందిన గణిత విభాగం ఉపాధ్యాయిని గుబ్బల అరుణకుమారి ఆధ్వర్యంలో పాఠశాలలోని తొమ్మిదో తరగతికి చెందిన మేడిచర్ల అమృత, ఉండ్రు ప్రణీతలు ప్రదర్శించిన ఇన్నోవేటివ్ మాథ్స్ కేలండర్ (మ్యాథ్స్ ప్రాజెక్టు) విభాగంలో జరిగిన పోటీల్లో పాఠశాల ఈమేరకు అర్హత సాధించినట్లు ఆయన వివరించారు. ఈ సందర్భంగా ఆదివారం పాఠశాల వద్ద జరిగిన కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో పాటు ఉపాధ్యాయిని అరుణకుమారిని గ్రామస్తులు అభినందించారు.

పశుసంవర్ధక శాఖలో క్లస్టర్ విధానాన్ని నిలిపివేయాలి

ఆలమూరు: రాష్ట్ర పశుసంవర్ధక శాఖలో ప్రభుత్వం ప్రవేశపెట్టేందుకు సన్నాహాలు చేస్తున్న క్లస్టర్ విధానాన్ని తక్షణం నిలిపివేయాలని ఏపీ వెటర్నరీ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా శాఖ డిమాండ్ చేసింది. మండలంలోని మూలస్థానం అగ్రహారంలో ఆదివారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యవర్గం సమావేశం జరిగింది. ఈసందర్భంగా అధ్యక్షుడు డాక్టర్ ఈదల శ్రీనివాసచౌదరి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో పశుసంవర్ధకశాఖ ఉద్యోగులు పాల్గొని ప్రసంగించారు. పశుసంవర్ధక శాఖలో రాష్ట్రస్థాయి అధికారులు ప్రతి సంవత్సరం ఆన్‌లైన్ ప్రగతి నివేదికలు ఇవ్వాలని, గ్రామీణ రైతాంగానికి మరింత మెరుగైన పశువైద్యం అందించాలని ఒత్తిడి తీసుకువస్తున్నారని ఆవేదన చెందారు. పశుసంవర్ధకశాఖలో అప్‌గ్రెడేషన్, రీఎంప్లాయిమెంట్, రీఆర్గనైజేషన్, రేషనలైజేషన్ తదితర క్లస్టర్ విధానాలు అమలు చేసేందుకు ప్రయత్నించడం దురదృష్టకరమన్నారు. క్లస్టర్ విధానాన్ని తక్షణం విరమించుకుని పాత పద్ధతిని కొనసాగించాలని లేనిపక్షంలో తమ న్యాయపోరాటానికి దిగుతామని వారు హెచ్చరించారు. కోశాధికారి మోటూరి రామారావు, ఉపాధ్యక్షుడు కేవీ రామరాజు, సంయుక్త కార్యదర్శి జీవీవీ సత్యనారాయణ, ఎల్ఎస్ఏ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.విజయబాబు, కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాబీకి అభినందనలు



అడవిపాలెంలో ఎస్సైగా ఎంపికైన బాబీని అభినందిస్తున్న గ్రామస్తులు

మలికిపురం: మండలంలోని అడవిపాలెం గ్రామానికి చెందిన జగతాని బాబీ ఇటీవల విడుదలైన ఎస్సై ఫలితాల్లో ఎస్సైగా ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా గ్రామంలో ఆదివారం గ్రామస్తులు బాబిని అభినందించారు. అగ్నికుల క్షత్రియ కుటుంబానికి చెందిన బాబీ ఎంతో కష్టపడి ఈ ఘనత సాధించారని గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు రావి మనస్సే అన్నారు. కార్యక్రమంలో నల్లి సత్యనారాయణ, గెడ్డం నాగభూషణం, కందికట్ల శ్రీనివాసరావు, గూరి సాయిబాబు, బాల కృష్ణ, కుసుమ అబ్రహం, యడ్ల పెద్దిరాజు, తదితరులు పాల్గొన్నారు.

నేలకొరిగిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



జగ్గన్నతోట వద్ద నేలకొరిగిన విద్యుత్ స్తంభం

అంబాజీపేట: మొసలపల్లి శివారు జగ్గన్నతోట ప్రభల తీర్థం జరిగే ప్రదేశం వద్ద ఒక విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నేలకొరిగింది. ఎన్నిసార్లు విద్యుత్ అధికారులకు సమాచారం ఇచ్చినా ఫలితం లేదని రైతులు, ప్రజలు వాపోతున్నారు. సంఘటన జరిగి పది రోజులయినా విద్యుత్ అధికారులు ఏ మాత్రం చర్యలు తీసుకోలేదని రైతులు, ప్రజలు పేర్కొన్నారు. ప్రభల తీర్థం జరిగే ప్రదేశంలో ఎక్కువగా రైతులతో పాటు వారికి చెందిన పశువులు, సంచరిస్తాయని, ట్రాన్స్‌ఫార్మర్ నేలను తాకుతుండటంతో పశువులతో వాటి ఉండే వ్యక్తులకు విద్యుత్ షాక్ తగిలే అవకాశముందని రైతులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు తక్షణమే తమ సమస్య పరిష్కరించాలని ప్రజలు, రైతులు, స్థానికులు కోరుతున్నారు.

వేంకటేశ్వరస్వామి సన్నిధిలో శంకర్రావు

ఆత్రేయపురం: వాడపల్లి వేంకటేశ్వరస్వామిని సినీ నటుడు, క్యారెక్టర్ ఆర్టిస్ట్ కోట శంకర్రావు దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య దేవతామూర్తులను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం దేవదాయ శాఖ ప్రతినిధులను సంప్రదించి ఆలయ విశిష్టతను అడిగి తెలుసుకున్నారు.